సాక్షి చిత్తూరు
మంగళవారం । 17 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	30	16
తిరుపతి	31	17
తిరుమల	26	13
గూడూరు	31	19
నగరి	32	18



పుత్తూరు ఫ్లైఓవర్‌పై విద్యుత్ కాంతులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిని రంగురంగుల విద్యుత్ లైట్లతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వీటికోసం రూ.2 లక్షలు వెచ్చించినట్టు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఆగని గజ దాడులు



ఏనుగులదాడిలో దెబ్బతిన్న చెరుకు తోట

సదుం: మండలంలో గత రెండు రోజులుగా ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. సోమవారం వేకువజామున జోగివారిపల్లె పంచాయతీ పరిధిలోని బాబూరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పంట పొలాలను నాశనం చేశాయి. చెరుకు, అరటి తోటలను కాళ్లతో తొక్కి చిందరవదరగా మార్చాయి. పొలం చుట్టూ ఉన్న కంచెను, రాతి కూసాలను సైతం విరిసివేశాయి. అలాగే ఆదివారం మారుతివారిపల్లెకు చెందిన మురళి, లోకనాథ, పెద్దబ్బకు చెందిన చెరుకు, కొబ్బరి తోటలను ధ్వంసం చేశాయి. ఏనుగల బారి నుంచి పంటలను రక్షించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

నేడు ట్రయల్ రన్ వీసీ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుతు వార్షిక ఆదాయ అవసరాలు, బిల్లుల పెంపుపై మంగళవారం జిల్లాలోని ఈఈ కార్యాలయాల్లో ట్రయల్‌రన్ వీసీ (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించనున్నారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు కరెంటు బిల్లుల పెంపు విషయమై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఇటీవల జిల్లాలోని అన్ని ఈఈ కార్యాలయాల్లో తిరుపతి డిస్కం కార్యాలయం నుంచి వీసీ మాక్‌టెస్టును నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించి రద్దీ ప్రదేశాల్లో ప్రచార బ్యానర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు.

నగర వనం, గజారామాల అభివృద్ధి



ప్లాంటేషన్లను పరిశీలిస్తున్న ఫారెస్ట్ ఐజీ

పలమనేరు: పట్టణ సమీపంలోని నగరవనం, గంగవరం మండలంలోని గజారామాలను అభివృద్ధి చేయనున్నట్టు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ మురళితో కలిసి ఆయన సోమవారం నగరవనం, గజారామం, కాలువపల్లి, దొడ్డిపల్లి కాంపెన్‌సేషన్ ప్లాంట్లను సందర్శించారు. అనంతరం డీఎఫ్వో మాట్లాడుతూ గాజారామంలో ఫారెస్ట్‌శాఖ స్థలంలోని హోటల్‌కు త్వరలోనే టెండర్లు ఆహ్వానించి పునఃప్రారంభిస్తామని తెలిపారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని రంగంపేట పరుష పందేలతో హోరెత్తింది. పౌరుషంతో కాలు దువ్వుతూ.. రంకెలేస్తూ పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు ప్రజానీకం పోటీపడింది. ఎద్ల కొమ్ములకు కట్టిన పలకలు, బహుమతులను సొంతం చేసుకుని విజయగర్వంతో ఊగిపోయింది. సుమారు మూడు గంటల పాటు ఎద్ల పందేల జోరు ఉత్సాహంగా సాగింది. అలాగే మండలంలోని పుల్లయ్యగారిపల్లి, శేషాపురంలోనూ పరుష పందేరాలతో సందడి వాతావరణం నెలకొంది.

జల్లికట్టు..ఉడుంపట్టు!



నేను విజిలేస్తే..!



రంకేసిన పౌరుషం!

- రంగంపేటలో పరుష పందేల జోరు
- తండోపతండాలుగా తరలివచ్చిన జనం

చంద్రగిరి: మండలంలోని రంగంపేట సోమవారం జనంతో కిక్కిరిసిపోయింది. ఎద్ల పందేలను తిలకించడానికి జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జనంతో ఇసుకేస్తే రాలనంతగా నిండిపోయింది. ఉమ్మడి జిల్లాలోనే ఎద్ల పందేల(జల్లికట్టు)కు ఏ రంగంపేట ప్రసిద్ధి చెందింది. పశువుల పండుగను తిలకించడానికి మహిళలు సైతం మిద్దెలు, మేడలు ఎక్కి ఆసక్తికరంగా తిలకించడం కనిపించింది.

ముస్తాబు చేసి.. బహుమతులు కట్టి

మొదట పశువులకు కొమ్ములు చివ్వి, రంగులు అద్ది యజమానులు ముస్తాబు చేశారు. అనంతరం నడుముకు నల్లదారం కట్టి సింగారించారు. తర్వాత ఎద్ల ఎమ్ములకు చెక్కతో తయారు చేసిన పలకలు, వాటి మధ్యలో బహుమతులు కట్టి జనంలోకి వదిలారు. వీటిని కైవశం చేసుకునేందుకు యువకులు పోటీపడ్డారు. పలువురు బహుమతులు సొంతం చేసుకుని విజయగర్వంతో ఊగిపోయారు.



ఎద్ల పందేలను తిలకిస్తున్న అశేష జనవాహిని



చెట్టెక్కిన అభిమానం



గాయపడ్డ యువకుడిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తూ..



తగ్గేదేలే!

పలువురుకి గాయాలు

పరుష పందేరాలను తిలకించేందుకు వచ్చిన వారిలో కొంతమంది యువకులు పశువులను పట్టుకునే క్రమంలో గాయాలపాలయ్యారు. ఎద్దులను నిలువరించే క్రమంలో వాటి కొమ్ములు తగలడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బందిని వారిని హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించారు.

ఉప్పొంగిన అభిమానం



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎత్తుకుని ఊరేగిస్తున్న ప్రజలు

చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏ రంగంపేటకు విచ్చేసి ఎద్ల పందేలను తిలకించారు. అంతకుముందు వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అభిమాన నేత అయిన చెవిరెడ్డిని జనం ఎత్తుకుని కాసేపు ఊరేగించారు. అనంతరం ఆయన గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారుకూతలు మానుకో బాబు!

- ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ప్రజలు ఊరుకోరు
- ఈ సారి జిల్లాలో పోటీచేసే పరిస్థితే ఉండదు
- బాబు జెండా మోయలేకే పవన్ చేతికిచ్చారు
- విలేకరుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, డెప్యూటీ సీఎం నారాయణస్వామి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : 'బాబు కారుకూతలు మానుకో. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ప్రజలు సహించరు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. తిరుపతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ఏదోఒకటి మాట్లాడి రెచ్చగొడుతున్నారని, పండగ పూటా తనతోపాటు తమ నాయకుడు వైఎస్ జగన్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడారని తెలిపారు. కడప నుంచి వస్తూ దారిలో ఆయన కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలను చూసి ఒళ్లు మరిచి కారుకూతలు కూశారని మండిపడ్డారు. ఈ సారి జిల్లాలో బాబు తిరిగి పోటీచేసే పరిస్థితి కూడా ఉండదని తేల్చిచెప్పారు.

అది నీ తరం కాదు

చిత్తూరు జిల్లాలో టీడీపీ మెజారిటీ నీ తరం కాదని బాబుకు హితవు పలికారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. తన అంతు చూడాల్సిన పనిలేదని, చంద్రబాబు అంతు చిత్తూరు జిల్లా ప్రజలే చూస్తారని మంత్రి హెచ్చరించారు.

కొడుకును తలుచుకుని బాధపడుతున్నాడు

చంద్రబాబునాయుడు తన కొడుకు లోకేష్‌ను తలుచుకుని బాధపడుతున్నారని, వైఎస్ జగన్ లాంటి కొడుకు తనకు ఎందుకు పుట్టలేదని నిత్యం మదనపడుతున్నారని వివరించారు. ప్రతిదాన్నీ ఆలోచించుకుని ఉన్న అల్జీమర్స్‌ను మరింత పెంచుకుంటున్నాడని, విశ్రాంతి తీసుకుని ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు.

దానిని కూడా తప్పుపట్టడమేనా?

రఘురామకృష్ణమ రాజుకు కోర్టు రిమాండ్ విధిస్తే చంద్రబాబు దానిని కూడా తప్పుపట్టడం మంచిది కాదని మంత్రి హితవు పలికారు. న్యాయస్థానాలను తామెప్పుడూ గౌరవిస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. త్వరలో కుప్పంలో కూడా తన జెండాను పీకేస్తారని ఆయనకు అర్థమయ్యే జెండాను మోసే శక్తి లేక పవన్ కల్యాణ్‌కు ఇచ్చేశారని ఎద్దేవా చేశారు.

అవి గుర్తులేదా బాబు?

సీఎంగా ఉన్నప్పుడు ఎంత మందిని అకారణంగా అరెస్ట్ చేశావు?.. ఎంత మందిని ఇబ్బంది పెట్టావు? గుర్తులేదా బాబు..? అంటూ మంత్రి నిలదీశారు. నాడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అకారణంగా కేసుల్లో ఇరికించారని చెప్పారు. నాడు అకారణంగా ఎంపీ మిథున్‌రెడ్డిని జైల్లో పెట్టించలేదా.. అని ప్రశ్నించారు.

మైనారిటీలపై ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చిందా..?

చంద్రబాబుకు ఉన్నట్టుండి ఇప్పుడు మైనారిటీలపై ప్రేమ పుట్టికొచ్చిందని మంత్రి మండిపడ్డారు. పుంగనూరు మున్సిపాలిటీని మైనారిటీలకు ఇచ్చామంటే వారిపై తమకు ఎంత ప్రేమ ఉందో బాబు గుర్తుచేసుకోవాలని మంత్రి సూచించారు.

తమ హయాంలోనే కుప్పం అభివృద్ధి

మారుమూల ప్రాంతమైన కుప్పానికి ఎవరూ రాకూడదని, ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా, అక్కడి ప్రజలు అభివృద్ధి చెందితే వారు అన్ని విషయాలను గ్రహిస్తారని కుట్రపూరితంగానే చంద్రబాబు కుప్పంను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

పెద్దిరెడ్డి పేరు వింటే చంద్రబాబు వెన్నులో వణుకు

తిరుపతి మంగళం : రాష్ట్రంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి, చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి పేరు వింటే చంద్రబాబు వెన్నులో వణుకు పుడుతోందని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14ఏళ్ల చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా చిత్తూరు జిల్లాలో 14 సీట్లుకు 10 సీట్లు తెప్పించిన మొనగాడు పెద్దిరెడ్డి అన్నారు. ఇప్పటికే ప్రజలు చంద్రబాబు సీటు చింపేశారని, దాంతో రోడ్డెక్కి పిచ్చివాడిలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో పిచ్చి ముదిరి రోడ్లపై కాగితాలు ఏరుకుంటాడేమోనని అసహనం వ్యక్తం చేశారు. ఎవరైనా చనిపోతే రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేసే చంద్రబాబు తన వల్ల చనిపోయిన 11మందికి ఎన్ని కోట్ల రూపాయలు ఇచ్చారని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డితో నిలబడి పోటీ చేసే దమ్ము, ధైర్యం బాబుకు ఉందా అని డెప్యూటీ సీఎం సవాల్ విసిరారు.

అభివృద్ధిలో మెరుస్తూ.. ప్రజల హృదయాలు గెలుస్తూ..



నారాయణి గార్డెన్స్‌లో సంక్రాంతి కానుకలను పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


- 1.6 లక్షల కుటుంబాలకు చెవిరెడ్డి సంక్రాంతి కానుకలు
- కంటికిరెప్పలా కాపాడుకునే ఎమ్మెల్యే దొరకడం చంద్రగిరి ప్రజల అదృష్టం
- తన సంపాదనలో 70 శాతం నియోజకవర్గ ప్రజల కోసమే
- కుటుంబ సభ్యులకంటే మిన్నగా చూసుకోవడం ఆయనకే సాధ్యం
- టీటీడీ చైర్మన్‌వైవీ సుబ్బారెడ్డి వెల్లడి

చంద్రగిరి: 'ఆపదొచ్చినా.. ఆనందమొచ్చినా తన నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునే చెవిరెడ్డి వంటి ఎమ్మెల్యే దొరకడం చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టం. ఆర్థిక ఇబ్బందుల వల్ల పండుగ జరుపుకోలేని పేదలకు.. అన్నీతానై సంతోషాన్ని పంచడం.. కరోనా వంటి కష్టం వచ్చినా.. వరదలు వచ్చినా.. అనారోగ్యం పాలైనా.. అందరికీ నేనున్నాననే ధైర్యం కల్పించే చెవిరెడ్డి నిజంగా ప్రతిఒక్కరికీ ఆదర్శం. కుటుంబ సభ్యులకంటే తన నియోజకవర్గ ప్రజలను ఎక్కువగా ప్రేమించడం ఆయనకు మాత్రమే సాధ్యం' అని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. సోమవారం మండలంలోని తొండవాడ సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో ఇంటింటికీ బట్టల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి చంద్రగిరిలో 1.6 లక్షల కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంపిస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తన నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు.

నేనున్నాననే ధైర్యం.. ప్రతి ఒక్కరికీ ఆదర్శం

చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం ఏదో ఒకరకంగా కానుకలు పంపించి ఆనందపరచడమేగాక కరోనా వంటి విపత్కర సమయంలో మాస్క్‌లు, శానిటైజర్, టాబ్లెట్లు, కాయగూరలు, కోడి గుడ్లు, ఆపిల్, దానిమ్మ, ఆరంజ్ వంటి వాటిని పంపిణీ చేస్తుంటే ప్రజలపై ఆయనకున్న ప్రేమ ఎలాంటిదో తెలుస్తోందన్నారు. క్వారంటైన్ కేంద్రాల్లో కంటికి రెప్పలా కాపాడారని, ఆ తర్వాత ఆయుర్వేద మూలికలతో తయారు చేయించిన ఆనందయ్య మందును అందించి కాపాడారన్నారు. ఆ తర్వాత వరదల్లో చిక్కిన ప్రజలకు హెలికాప్టర్ల ద్వారా ఆహారం అందించి, రాయల చెరువుకు గండి పడితే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని చెప్పారు.

టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు



భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

తిరుమల: తిరుమలలోని పాత అన్నదానం కాంప్లెక్స్‌లో సోమవారం మధ్యాహ్నం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. క్యూలో ఉన్న భక్తులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎంబీసీ వద్ద మినీ అన్నదానం కాంప్లెక్స్

శ్రీవారి మెట్టు నడకదారిలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎంబీసీ ప్రాంతంలో మినీ అన్నదానం కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఆయన అధికారులతో కలిసి శ్రీవారి మెట్టు నుంచి భక్తులు తిరుమలకు చేరుకునే ప్రాంతాన్ని పరిశీలించారు. నడిచి వచ్చిన పలువురు భక్తులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో మినీ అన్నదానం కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆర్‌బీసీ సెంటర్లోని నివాసగృహాలను పరిశీలించారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఆరాధన కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఇంకా మిగిలి ఉన్న ఇళ్లను తొలగించి పార్కింగ్ ప్రాంతంగా తయారు చేయాలని అధికారులకు సూచించారు.

గో పూజలో చైర్మన్

కనుమ పండుగ సందర్భంగా తిరుమలలోని గోశాలలో జరిగిన గోపూజలో టీటీడీ చైర్మన్ పాల్గొన్నారు. గోమాతకు పూలు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

అప్పుడే వెళ్లిపోయారా నాయనా?



విఘ్నేష్ మృతదేహం వద్ద కన్నీరుమున్నీరవుతున్న మిత్రులు

- రెండు ద్విచక్రవాహనాలు ఢీ
- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

నగరి : 'అయ్యో.. ఎంతపని జరిగింది. ఇంటి కొస్తున్న బిడ్డలు అర్థంతరంగా వెళ్లిపోయారే.. ఇప్పటిదాకా మాతో కలిసిమెలిసి ఉన్న స్నేహితులు అంతలోనే మృత్యుఒడికి చేరుకున్నారే..' అంటూ మృతుల బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మున్సిపల్ పరిధిలోని నగరిపేట సమీపం జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. సోమవారం రాత్రి కాకవేడు దళితవాడకు చెందిన కార్తిక్(27) పండగలకు పాండిచ్చేరి నుంచి వచ్చిన తన పెదనాన్న దాసు(60)తో కలిసి ద్విచక్రవాహనంలో పుత్తూరుకు బయలుదేరాడు. అదే సమయంలో కేవీపీఆర్ పేటకు చెందిన విఘ్నేష్(24), ప్రశాంత్(18) పుత్తూరు నుంచి స్వగ్రామానికి బైక్‌లో బయలు దేరారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు మార్గమధ్యంలో నగరిపేట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్తిక్, విఘ్నేష్ అక్కడికక్కడే మృతిచెందారు. ప్రశాంత్, దాసుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం ప్రశాంత్‌ను తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. దాసు నగరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మృతుడు కార్తిక్‌కు వివాహమై భార్య ఉంది. ఇతను జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విఘ్నేష్‌కు వివాహం కాలేదు. ఇతను బేళ్లు మోసే కూలీగా పనిచేస్తున్నాడు. ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బంధువుల ఆర్తనాదాలు, మిత్రుల కన్నీటి రోదనతో ఆస్పత్రిలో విషాదఛాయలు అలుముకున్నాయి.




మృతుడు కార్తిక్, కార్తిక్ (ఫైల్)




మృతుడు విఘ్నేష్, విఘ్నేష్ (ఫైల్)

రెండు ద్విచక్ర వాహనాల ఢీ : వ్యక్తి మృతి

గంగాధరనెల్లూరు: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చిత్తూరు– పుత్తూరు రహదారి వేల్కూరుమిట్ట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం.. కడపగుంటకు చెందిన నాగరాజు, అతని స్నేహితుడు ధర్మ కలిసి ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు బయలు దేరారు. ఈ క్రమంలో వేల్కూరు మిట్టవద్ద యూటర్న్ తీసుకుంటుండగా చిత్తూరు నుంచి జీడీనెల్లూరుకు వస్తున్న మోటర్ సైకిల్ ఢీకొంది. దీంతో వెనుక వైపు కూర్చుని ఉన్న ధర్మ(37) రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు



తిరుపతి మారుతీ నగర్‌లోని మంత్రి నివాసం వద్ద కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

తిరుపతి మంగళం: జిల్లాలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో సోమవారం రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాలను చేసుకున్నారు. పశువుల పండుగ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో పాటు డెప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, పార్టీ సీనియర్ నాయకులు ఎంఆర్‌సీ.రెడ్డితో కలిసి పెద్ద ఎత్తున చిట్లాకుప్ప కాల్చారు. అనంతరం ఆవులను ప్రత్యేకంగా అలంకరించి గోపూజ చేశారు. సంక్రాంతి పండుగలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడుతాయని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. నేటి తరానికి తెలుగు పండుగలతో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేస్తాయన్నారు. సంక్రాంతి పండుగ ప్రజలంతా సంతోషంగా జరుపుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలంతా భోగభాగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు.

కనుమ కమ్మనైన అనుభూతులు నింపాలి



బసవన్నకు పూజలు చేస్తున్న మంత్రి రోజా

- మంత్రి ఆర్కేరోజా

నగరి: కనుమ ప్రజలకు కమ్మనైన అనుభూతులను నింపాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఆకాంక్షించారు. ఆది, సోమవారాల్లో వైఎస్సార్ జిల్లా, సంబేపల్లి మండలం, శెట్టిపల్లి గ్రామం తిమ్మక్కగారిపల్లెలో తన సోదరుని నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకున్నారు. కనుమ రోజున గోమాతకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంప్రదాయాలకు నెలవన్నారు. సంక్రాంతి అంటేనే రంగు ముగ్గులు, బంధువులందరితో కలసి సంబరాలు చేసుకోవడం అన్నారు. అన్నదాత అయిన రైతుకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ సంక్రాంతి అయితే రైతుతో పాటు వ్యవసాయ పనుల్లో పాల్గొనే గోమాతకు ప్రాధాన్యత ఇవ్వడానికి కనుమ పండుగన్నారు. గోమాత సకల దేవతలకు నిలయమన్నారు. గోమాతను పూజిస్తే దేవతలందరినీ పూజించినట్లే అన్నారు. ఈ పూజల్లో ఆమె భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, కుమార్తె అన్షుమాలిక, కుమారుడు కృష్ణకౌశిక్, సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నపై తరగని అభిమానం



పూజలు చేస్తున్న రఘుపతిరాజు కుటుంబ సభ్యులు

బంగారుపాళెం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిపై ప్రజాభిమానం తగ్గలేదు. బంగారుపాళెం మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన వైఎస్సార్ అభిమాని రఘుపతిరాజు ఆదివారం సంక్రాంతి పండుగ సందర్భంగా అమరులైన తన తల్లిదండ్రులతో పాటు అమితంగా అభిమానించే వైఎస్ రాజశేఖరరెడ్డికి కూడా కొత్త బట్టలు పెట్టి పూజలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులను పిలిచి మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాజశేఖరరెడ్డి మృతిచెందినప్పటి నుంచి ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజున తల్లిదండ్రులతో పాటు రాజశేఖరరెడ్డికి కూడా బట్టలు పెట్టి పూజిస్తున్నారు.

మారథాన్‌లో ఎస్‌ఐ ప్రతిభ



పతకంతో ఎస్‌ఐ రామకృష్ణ

చిత్తూరు అర్బన్: ముంబైలో ఆదివారం జరిగిన మారథాన్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్‌ఐ రామకృష్ణ ప్రతిభ చాటారు. టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ముంబైలో జరిగిన మారథాన్‌లో పాల్గొన్న ఆయన 42.4 కి.మీ దూరాన్ని 4.19 గంటల వ్యవధిలో పూర్తిచేశారు. చిత్తూరు నగరంలోని తాలూక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు క్రీడలంటే మక్కువ. బ్యాడ్మింటన్‌లో అంతర్రాష్ట్ర క్రీడాకారుడిగా రాణిస్తున్న ఈయనకు.. దేశంలో మారథాన్ ఎక్కడా జరిగినా పాల్గొనడం అలవాటు. అయితే ఇప్పటి వరకు హాఫ్ మారథాన్(20 కి.మీ), మినీ మారథాన్(22కి.మీ)లలో ఎక్కువగా పాల్గొన్న రామకృష్ణ.. తొలిసారిగా సంపూర్ణ మారథాన్ (42.2కి.మీ)లో పాల్గొని సత్తా చాటారు. రామకృష్ణను చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసమూర్తి పోలీసుశాఖ తరఫున ప్రత్యేకంగా అభినందించారు.

18న కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

పుంగనూరు : పాలసముద్రం ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ పురుషుల జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ సంఘం కార్యదర్శి పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 85 కేజీల బరువుగల క్రీడాకారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్టు ఈ నెల 25వ తేదీ నుంచి అనకాపల్లెలో నిర్వహించనున్న అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఇతర వివరాలకు 9440934507 నంబర్లో సంప్రదించాలని కోరారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యం, స్కూటర్‌తో నిందితుడు

శాంతిపురం: అక్రమంగా 260 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని రాళ్లబూదుగూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మునస్వామి కథనం మేరకు, ఆదివారం గెసికపల్లి వద్ద జరుపుతున్న వాహన తనిఖీల్లో స్కూటరుపై కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. తనను విచారించి కుప్పం మండలం లక్ష్మీపురానికి చెందిన మురుగ అనే మురుగేష్‌గా గుర్తించారు. పట్టుబడిన 260 ప్యాకెట్ల 90 ఎంఎల్ మద్యం విలువ రూ 7,300గా ఎస్సై తెలిపారు. మద్యం, స్కూటర్ సహా నిందితుడిని అదుపులోకి తీసుకుని కుప్పం కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు మురుగను రిమాండుకు తరలించామని చెప్పారు.

90 ప్యాకెట్ల మద్యం స్వాధీనం



అరెస్ట్ చేసిన వ్యక్తితో ఏఎస్‌ఐ వాసు

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంటకు చెందిన జి.మునివెంకటప్ప వద్ద 90 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్‌ఐ వాసు తెలిపారు. ఈ మేరకు సోమవారం అతన్ని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్టు వెల్లడించారు. మద్యం అక్రమ రవాణాకు పాల్పడినా, మత్తుపదార్థాలు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు మంజునాథ్, బుడ్డానాయక్, వాసు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు : ఒకరి మృతి



మృతి చెందిన జయచంద్రారెడ్డి

శ్రీరంగరాజపురం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి, నెలవాయి గ్రామం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. నెలవాయి గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి (61)ఎస్‌ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీలో రిటైర్డ్ ఫీల్డ్ ఆఫీసర్. సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని సానకుప్పం గ్రామం నుంచి మటన్ తీసుకుని స్వగ్రామమైన నెలవాయికి బైక్‌లో బయలుదేరాడు. గ్రామ సమీపంలో వస్తుండగా వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో జయచంద్రారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 సిబ్బంది చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. ఎస్‌ఐ షేక్షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె : మండలంలోని పాతపేట గ్రామానికి చెందిన కాలెప్ప కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం ఎస్‌ఐ వెంకటనరశింహులు తమ సిబ్బందిలో కలిసి దాడులు చేపట్టారు. అతని వద్ద 72 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బైరెడ్డిపల్లెలో చికెన్‌దుకాణ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

భార్యపై అనుమానంతో హత్య?

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ఓ వివాహిత సోమవారం మృతి చెందింది. ఆమెపై అనుమానంతో నిత్యం గొడవపడుతున్న ఆమె భర్తే హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం.. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన భాస్కరయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరిలో రెండవ కుమార్తె ఉమామహేశ్వరిని సూళ్లూరుపేటకు చెందిన తన మేనల్లుడు చెంగయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. చెంగయ్య శ్రీకాళహస్తిలోని అత్త వారింటికి ఇల్లరికం వచ్చాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉమామహేశ్వరి ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తోంది. ఇటీవల ఆమెపై అనుమానంతో చెంగయ్య తరచూ గొడవపడుతుండేవాడు. సోమవారం ఉదయం ఉమామహేశ్వరి ఫోన్ పనిచేయకపోవడంతో ఆమె కుటుంబసభ్యులు ఇంటి వద్దకు వచ్చారు. అప్పటికే తలపై బలమైన గాయం అయి ఉమామహేశ్వరి మృతి చెందినట్లు గుర్తించారు. 1వ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో సోమల వాసి మృతి



మృతిచెందిన జాఫర్ హుస్సేన్ (ఫైల్)

చౌడేపల్లె: సోమలకు చెందిన సీహెచ్ జాఫర్‌హుస్సేన్ (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చౌడేపల్లె–పలమనేరు మార్గంలోని అనంతరాయుని చెరు కట్ట కింద సీహెచ్ జాఫర్‌హుస్సేన్ మృతిచెంది పడి ఉండడాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ వాసు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్, పాస్‌పోర్టు సైజు ఫొటో ఆధారంగా ఆచూకీ తెలుసుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున మృతుడి కుటుంబీకులను ఆరాతీశారు. జాఫర్‌హుస్సేన్ సోమల పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా నివాసముండేవాడు. ఇతనికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఇతను నెల్లూరు, పరిసర ప్రాంతాల్లో పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నెలకు ఒక్కసారి ఇంటికి వచ్చేవాడు. ఈక్రమంలో ఇలా మృత్యువాత పడడం వెనుక అనుమానం వ్యక్తం చేస్తూ అతని కుమారుడు అహ్మద్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్‌ఐ వాసు తెలిపారు. ఇతను మృతిచెంది రెండు రోజులై ఉంటుందని భావిస్తున్నారు.

రెండు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు




ప్రమాదంలో దెబ్బతిన్న కారు, గాయపడ్డ జయంతి

పుత్తూరు రూరల్: రెండు ప్రమాదాల్లో నలుగురు గాయపడిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పట్టణ పరిధిలోని ఈశ్వరాపురం గ్రామం నుంచి పుత్తూరు వైపు వస్తున్న కారు, పళ్లిపట్టు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈశ్వరాపురానికి చెందిన శంకర్ కుటుంబ సభ్యులు ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైపాస్ రోడ్డులో..

పుత్తూరు బైపాస్ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ, చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. నాగలాపురం నుంచి తిరుపతికి వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న జయంతి అనే మహిళతో పాటు ధనశ్రీ (7)కి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పండగ పూట విషాదం

- జాతీయ రహదారిపై ప్రమాదం
- పదినెలల చిన్నారి, డ్రైవర్ మృతి
- మరో ఆరుగురికి గాయాలు
- రెండు కుటుంబాల్లో విషాదఛాయలు



ప్రమాదానికి గురైన కారు



మృతిచెందిన పదినెలల చిన్నారి తార్విక



మృతిచెందిన బొలేరో డ్రైవర్ ఇమ్రాన్‌బాషా



గాయపడిన అర్చన



గాయపడిన క్లీనర్ ఖాజా

పలమనేరు/గంగవరం: సంతోషంగా స్వగ్రామంలో పండుగకోసం బయలుదేరిన ఆ కుటుంబానికి రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. గంగవరం మండలం నాలుగురోడ్ల ఫ్లైఓవర్‌పై చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు, బోలేరో వాహనాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లెకి చెందిన మణి కుటుంబం కొన్నేళ్లుగా బెంగళూరులో ఉంటోంది. ఈమధ్యనే కొన్న కొత్త కారులో కుటుంబసభ్యులంతా కలసి స్వగ్రామంలో సంక్రాతి పండగను జరుపుకునేందుకు బయలుదేరారు. ఆదివారం సాయంత్రం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో నాలుగురోడ్ల ఫ్లైఓవర్‌పై వస్తున్న కారు వేగంగా వెళ్లి ఫర్నీచర్ లోడుతో ముందు వెళుతున్న బొలేరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని పదినెలల చిన్నారి తార్విక మృతిచెందింది. బొలేరో డ్రైవర్ ముళబాగిల్‌కు చెందిన ఇమ్రాన్‌బాష (37) మృతిచెందారు. కారులోని మణి(54), అతని భార్య కవిత(49), వీరి కుమార్తె అర్చన(26), కుమారుడు లక్ష్మీప్రశాంత్(24) అల్లుడు యువరాజు(35), బొలేరో క్లీనర్ ఖాజ(26) గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న గంగవరం పోలీసులు గాయపడినవారిని పలమనేరు ఆస్పత్రికి తరలించారు. భారీగా స్తంభించిన ట్రాఫిక్‌ను పునరిద్ధరించారు. మృతిచెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు గాయపడిన వారిని మెరుగైన చికిత్సకోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. జరిగిన ప్రమాదంపై గంగవరం సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

పది నిమిషాల్లో గ్రామానికి వెళ్లుండేవారు

కొత్త కారులో స్వగ్రామానికి బయలుదేరిన మణి కుటుంబం వారి గ్రామానికి ఐదారు కిలోమీటర్ల దగ్గరకు వచ్చాక ఈ ప్రమాదం జరిగింది. పది నిమిషాల్లో ఇంటికి సంతోషంగా వెళ్లాల్సిన వీరు రక్త గాయాలు, చిన్నపాప మృతితో ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మరోవైపు కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు చెందిన ఇమ్రాన్ బాష డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతని మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. బోలేరో వాహనం సైతం ఈ ప్రమాదం జరక్కుండా ఉంటే మరో పదినిమిషాల్లో పలమనేరుకు చేరుకొనేది.

అతివేగమే కారణమా?

మణి కుటుంబం ఇటీవల కొత్త కారును కొంది. అనుభవం ఉన్న డ్రైవర్‌కు కాకుండా మణి కుమారుడు లక్ష్మీప్రశాంత్(24) కారును నడిపాడు. ప్రమాదం జరిగినపుడు కారు వేగం 120 కిలోమీటర్లకంటే ఎక్కువగానే ఉంటుందని చుట్టుపక్కల వాహనాల వాళ్లు చెబుతున్నారు. ఏమాత్రం కారు నడపడంలో అనుభవం లేని వారికి కారివ్వడమే ప్రమాదానికి కారణమయిందని అక్కడున్న వారు చర్చించుకుంటున్నారు.